వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/హెచ్ఐ) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 10వ తేదీ నుంచి, బీఏఎస్ఎల్‌పీ (సీబీసీఎస్) రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఓడీఎల్) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు మూడేళ్ల ఫార్మ్‌డీ, ఆరేళ్ల ఫార్మ్‌డీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వాయిదా పడిన పరీక్ష తేదీల ఖరారు

ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈనెల 2వ తేదీన నిర్వహించాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను నిర్ణయించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షను ఈనెల 9న, అన్ని లా కోర్సుల పరీక్షలను ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రం, పరీక్ష సమయంలలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

8న టీజీ సీపీజీఈటీ మొదటి దశ సీట్ల కేటాయింపు జాబితా విడుదల

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ సీపీజీ ఈటీ – 2024 మొదటి దశ సీట్ల కేటాయింపు జాబితాను ఈనెల 8న విడుదల చేయనున్నట్లు సీపీజీ ఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. రెండో దశ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ఇతర వివరాలకు తమ వెబ్‌సైట్‌ను క్రమం తప్పక చూడాలని సూచించారు.

మెరుగైన వైద్యం అందించండి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
గతంలోనే నిధులు మంజూరు
దవాఖాన ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


మహేశ్వరం మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 4: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మహేశ్వరం మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యం ఎలా అందిస్తున్నారని.. ఆస్పత్రిలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించి, పెండింగ్ పనుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు రావడం ఎమ్మెల్యేకు వివరించారు. వేతనాలు ఇవ్వకపోతే తాము ఎలా బతకాలని మొర పెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వేతనాలు వచ్చే విధంగా చొరవ తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

గతంలోనే 50 పడకలకు అప్‌గ్రేడ్

మహేశ్వరం మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు అప్ గ్రేడ్ చేయడం జరిగిందని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీహెచ్‌సీ మహేశ్వరం ఆస్పత్రిని 50 పడకలకు అప్ గ్రేడ్ చేస్తూ 509 జీవోను జారీచేయడం జరిగిందని.. రూ.4.43కోట్లు మంజూరు చేశామని, పరిపాలన పరమైన అనుమతులు తీసుకోవడం జరిగిందన్నారు. మంజూరైన నిధులు విడుదల చేయాలని.. 50 పడకల ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేయాలని అన్నారు.

ఆపదలో అండగా సీఎంఆర్ఎఫ్..

ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజా రెడ్డి, చైర్మన్ పాండు, అంబయ్య యాదవ్, రాజేశ్, సమీర్, అధికారులు, వైద్యులు తదితరులు ఉన్నారు.

చెరువుల సుందరీకరణకు కృషి

ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి.. మంత్రాల చెరువు కట్టపై స్ట్రీట్ లైట్లు ప్రారంభం

మీర్‌పేట మంత్రాల చెరువు కట్టపై స్ట్రీట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంపేట, సెప్టెంబర్ 4: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో చెరువుల సుందరీకరణ పనులు చేయడం జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు కట్టపై రూ.కోటితో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాత్రి సమయంలో చెరువు కట్టపై ప్రమాదాలు జరుగకుండా లైట్లు ఏర్పాటు చేశామని, ఇరుకుగా ఉన్న చెరువు కట్టను విస్తరించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశామని తెలిపారు. చెరువు చుట్టూ గ్రీనరీ, పిల్లల కోసం చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గా, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఆర్వీ చంద్రశేఖర్ రెడ్డి, రమేశ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

మట్టి గణపతులను పూజించాలి

కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు పెంటపాటి కృష్ణాదిశేషు

మట్టి విగ్రహాలతో ఉపయోగాలను వివరిస్తున్న సెన్సార్ బోర్డు సభ్యుడు కృష్ణాదిశేషు

వనస్థలిపురం, సెప్టెంబర్ 4: వినాయక చవితికి మట్టితో తయారు చేసిన గణపతిని పూజించి పండుగ పవిత్రతను కాపాడాలని కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు పెంటపాటి కృష్ణాదిశేషు అన్నారు. బుధవారం వనస్థలిపురంలో మట్టి పర్యావరణ గణపతిని పూజించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీరు విషతుల్యమవుతుందన్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం స్వచ్ఛమైన మట్టితో తయారు చేసిన విగ్రహాలకు పవిత్రంగా పూజలు చేయాలన్నారు. ప్రజలంతా పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు.

నాదర్‌గుల్‌లో ఉన్న గురుకుల హాస్టల్‌లో పారిశుధ్యం పనులు చేస్తున్న దృశ్యం

గురుకులం మెరిసె

నమస్తే కథనానికి స్పందన
నేడు గురుకులంను సందర్శించనున్న ఎమ్మెల్యే

మహేశ్వరం, సెప్టెంబర్ 4: సమస్యల గురుకులం కథనానికి అధికారులు స్పందించారు. బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి సిబ్బందితో కలిసి నాదర్‌గుల్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల(గురుకుల)లో పారిశుధ్యం పనులు చేయించారు. చెత్త తొలగింపు.. టాయిలెట్స్, మరుగుదొడ్లు క్లీనింగ్, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేయించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. కిటికీలు అమర్చడానికి గ్రిల్స్ తీసుకొచ్చారు. ప్రహరీ గోడ పనులను చేయిస్తున్నారు. కందుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసి గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలను వివరించారు. గురువారం గురుకుల హాస్టల్‌ను సందర్శిస్తానని పేరెంట్స్ కమిటీకి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ గురుకుల స్కూల్, జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలపై స్పందించారు. పేదల పిల్లలు చదువుకుంటున్న గురుకుల హాస్టల్‌లో కనీసం మంచి నీళ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించక పోతే ఎలా? రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కొంత మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందని తెలిపారు.

శాతవాహన నగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

వనస్థలిపురం, సెప్టెంబర్ 4: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. శాతవాహన నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలకు నిత్యం నీరు నిలుస్తుందని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దీంతో నిధులు మంజూరు చేయించామన్నారు. వర్షాల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుని పనులు పూర్తి చేయాలని సూచించారు. కాలనీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని సూచించారు. చెత్త నిర్వహణలో సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నందిరాజు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వరుణ్‌సాయి, కృష్ణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్) సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు

ఆయుష్‌లో ముగిసిన జాతీయ సదస్సు

సైదాబాద్, సెప్టెంబర్ 4: సైదాబాద్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ బోర్డు కాలనీలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్)లో రెండు రోజులపాటు జరిగిన సంప్రదాయ వైద్యంలో ఔషధ అభివృద్ధిపై జాతీయ సెమినార్ బుధవారం ముగిసింది. సదస్సు ముగింపు సందర్భంగా సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్(న్యూఢిల్లీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.శ్రీకాంత్, డాక్టర్ మధు దీక్షిత్, డాక్టర్ చంద్రకాంత్ కటియార్ పలు అంశాలపై ప్రసంగించారు. 13 మంది వక్తలు 6 సాంకేతిక సెషన్లలో సంప్రదాయ వైద్య వ్యవస్థల్లో కొత్త మందులను అభివృద్ధి చేయడంలో తాజా పురోగతి, భవిష్యత్ దిశలపై దృష్టి సారించి వివిధ పరిశోధనా అంశాలను సమర్పించారు. అదే విధంగా నాణ్యమైన పరీక్షలు, ఔషధాలలో ఉపయోగించే ముడి పదార్థాల ప్రామాణీకరణ, సంప్రదాయ, క్లిష్టమై యంత్రణ వంటి అంశాలపై చర్చించారు. అయూష్ మంత్రిత్వశాఖ చెందిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్ చెందిన నిపుణులు పాల్గొని తమ పరిశోధన పత్రాలను ప్రవేశపెట్టి వివరించారు. ఈ సదస్సులో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ ఇన్‌చార్జి డైరెక్టర్ జీ.పీ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా విజయభాస్కర్

విజయభాస్కర్

సైదాబాద్, సెప్టెంబర్ 4: హైదరాబాద్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు షాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.విజయ భాస్కర్ ఎంపికయ్యారు. బుధవారం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యానని జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తెలిపారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయటం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యాక్రమానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, జంటనగరాల్లోని ఉప విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన విజయ భాస్కర్‌ను పలువురు అభినందించారు.

నాలా గిట్లుంటె ఎట్ల?

పెద్ద వానొస్తే రోడ్డు చెరువు కావాల్సిందే
వరద నీరు పోవడానికి దారిలేదు?
పరిష్కారం చూపుని అధికారులు
సమస్యపై బడంగ్‌పేట పాలకవర్గ మౌనం

చెత్తాచెదారంతో నిండిపోయి బడంగ్‌పేట పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ దగ్గర మూసుకుపోయిన నాలా

బడంగ్‌పేట, సెప్టెంబర్ 4: అసలే వర్షాకాలం. ఆపై భారీ వర్షాలు. ఆర్సీఐలో ఉన్న కొత్తకుంట అలుగు పారితే ఆ నీళ్లు ఎటు పోవాలి? నాలా పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. ఇటు వ్యర్థాలు, అటు మురుగుతో కంపుకొడుతోంది. ఈ పరిస్థితుల్లో కూడా బడంగ్‌పేట ప్రధాన రహదారిలో ఉన్న నాలా సమస్యను అధికారులు ఎటు తేల్చలేక పోతున్నారు. గతంలో భారీ వర్షం వస్తే డీమీస్ స్కూల్ పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ మధ్యన ఉన్న రోడ్డు చెరువును తలపించిన సందర్భాలు ఉన్నాయి. నిత్యం ఈ రోడ్డుపై లక్షల సంఖ్యలో వాహనాలు పోతుంటాయి. వరద నీరు పోవడానికి నాలా పూర్తిగా మూసుకుపోయింది. నిత్యం అధికారులు, బడంగ్‌పేట పాలకవర్గ సభ్యులు ఇదే నాలా ముందు నుంచి ప్రయాణిస్తుంటారు. నాలా క్లియర్ చేయలేక మౌనం వహిస్తున్నారు. ఎవరిని ప్రశ్నించినా పెద్దవి విప్పడం లేదు. రాబోయే రోజుల్లో ఇది పెను ప్రమాదకరంగా మారేలా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆర్సీసిలో ఉన్న కొత్తకుంట అలుగు పారితే ఇక అంతే. రాకపోకలకు అంతరాయం తప్పదు. వర్షం నీరు ప్రస్తుతం కల్వెట్ దగ్గర ఆగిపోయింది. చెత్తా చెదారంతో నిండిపోయింది. వర్షం నీరు పోవడానికి దారి లేకుండా పోయింది. సమస్య వచ్చిన్నప్పుడు మాత్రమే అధికారులు హడావిడి చేస్తుంటారు. ముందు సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి అధికారుల్లో లోపించన్నట్లు కన్పిస్తున్నారు. నిత్యం కొబ్బరి కాయలు కొట్టడానికి ప్రధాన్యత ఇచ్చే ప్రజా ప్రతినిధులు నాలా సమస్యను పరిష్కరించాలన్న ఆలోచనను మాత్రం మర్చిపోయారు. సమస్య పరిష్కారంపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారో వేచిచూడాల్సిందే మరి.

భారతీయ కిసాన్ సంఘ్ బలోపేతానికి కృషి చేయాలి

కందుకూరులో నూతన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్ గౌడ్

కందుకూరు, సెప్టెంబర్ 4: భారతీయ కిసాన్ సంఘ్ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గడిగే గజేందర్ గౌడ్ తెలిపారు. మండల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింహ గౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నోముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా కందుకూరు గ్రామానికి చెందిన సురుసాని సీతారెడ్డి, కార్యదర్శిగా కటికపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య గౌడ్, ఉపాధ్యక్షులుగా కృష్ణాగౌడ్ (కొత్తగూడ), గంగుల రవీందర్‌రెడ్డి (నేదునూరు), కోశాధికారిగా సురుసాని యాదగిరిరెడ్డి (లేమూరు), సంయుక్త కార్యదర్శుగా చిట్టి లక్ష్మణ్, (రాచులూరు), సలహాదారునిగా సురుసాని వెంకట్‌రెడ్డి (కందుకూరు), సునీల్‌కుమార్ మిశ్రా (ముచ్చర్ల), సభ్యులుగా పాశం శ్రీనివాస్, (కొత్తూరు), బద్దుల రమేశ్, చంద్రశేఖర్ (నేదునూరు) ఎన్నికయ్యారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

డివిజన్‌లో పర్యటిస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, సెప్టెంబర్ 4: పాత మలక్‌పేట డివిజన్‌లో మెరుగైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల తెలిపారు. బుధవారం ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి డివిజన్ పరిధలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బయటకి వెళ్లవద్దని.. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేపడుతామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సరిగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆజంపురా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చోరీ

మలక్‌పేట, సెప్టెంబర్ 4: ఆజంపురా పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ల్యాప్ టాప్, ట్యాబ్‌లు, ఇత్తడి నల్లాలను అపహరించుకుపోయారు. ఈ ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పర్వేజ్ కథనం ప్రకారం గుర్తు తెలియన్ వ్యక్తులు బాత్‌రూంకు ఉన్న కిటికీలోంచి ఆస్పత్రిలోకి చొరబడి రిఫ్రిజిరేటర్‌ను ధ్వంసం చేశారు. ఇతర విలువైన వస్తువులను చిందరవందరం చేశారు. ఆస్పత్రి వైద్యురాలు అందుబాటులో లేనందున చోరీకి గురైన వస్తువులపై స్పష్టత లేదని.. గతంలోనూ ఈ వైద్యశాలలో రెండు సార్లు దొంగతనం జరిగిందని ఎస్ఐ పర్వేజ్ తెలిపారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్లు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నామని.. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తా..

డైరెక్టర్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న రాంరెడ్డి

కందుకూరు, సెప్టెంబర్ 4: పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని కందుకూరు మండల పరిధి ఆకులమైలారం మదర్ డెయిరీ చైర్మన్ ఎడ్ల రాంరెడ్డి తెలిపారు. బుధవారం ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్ (మదర్ డైరీ) డైరెక్టర్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన ఆయన మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే పాడి రైతుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కందుకూరు, పులిమామిడి, దెబ్బడగూడ, మీర్‌ఖాన్‌పేట్ గ్రామాల అధ్యక్షులు టంకరి సంజీవరెడ్డి, బుచ్చిరెడ్డి, అరుణ, ఎండీ వహీద్, ఊట్లపల్లి గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య, సుగుణమ్మ, రావుల జంగయ్య, సురేందర్, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

19 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మలక్‌పేట, సెప్టెంబర్ 4: తెలంగాణ ఓపెన్ మాస్టర్స్ డబుల్స్ ప్రైజ్‌మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2024ను రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి వెల్లడించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సౌజన్యంతో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట–నాగోల్ రహదారిలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ పక్కనున్న స్పీడ్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 19 నుంచి 22 వరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనగోరే వారు 16వ తేదీ లోపుగా https://btron line.in/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని, స్పాట్ ఎంట్రీస్ లేవన్నారు. మెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొనగోరే క్రీడాకారులు ఎంట్రీ ఫీ రూ.1200లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 55–70 ఏండ్లు ఉన్న క్రీడాకారులకు 19, 20న పోటీలు నిర్వహించబడతాయని, 35–50 ఏండ్ల గల క్రీడాకారులకు 21, 22న టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7788993006, 9848015443 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షులు కె.లక్ష్మన్, పి.ఆనంద్‌బాబు, టీఎన్ఆర్.రవి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త కార్యదర్శి యూవీఎన్.బాబు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The members of general public are hereby informed that our clients are intending to purchase Plot bearing No. 747 admeasuring 500 sq. yards in Survey No. 234/2, The Indira Gandhi Co-operative Housing Society Limited, situated at Jalpalli Village, Balapur Mandal, Ranga Reddy District Hyderabad from its owner and possessor Sri Dugyala Rajeshwar Rao rep by AGPA holders Sri Chapalabanda Ram Mohan and Sri Chapalabanda Sai Mohan. If any member of general public has any right, title, claim or interest in respect of the said property, they are hereby called upon to furnish particulars of such claim along with copies of the documents etc., to the undersigned within a period of [7] days from the date of this publication failing which our clients shall proceed with the transaction and conclude the same and objections, if any, raised subsequently will not be entertained.

Sd/- M. NARSIMHA REDDY
Advocate
M/s. Ganu and Co. Advocates
201-202, 3.5.874/A
Vipanchi Estates, Hyderguda,
Hyderabad-500029